

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 07-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :140 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

కాంగ్రెస్‌లో వర్గపోరు

అధిష్టానం వద్దకు పంచాయితీ!



- గాంధీ భవన్‌కు దుమ్మా కొట్టిన మంత్రి
- ఎమ్మెల్యే భేటీని రద్దు చేసిన మహేశ్ గౌడ్
- నేతల తీరుపై పీసీసీ చీఫ్ ఆగ్రహం
- సంగారెడ్డి డీసీసీ నియామకంతో వివాదం
- ఢిల్లీలో మంత్రి, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం
- బెదిరింపులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే వర్గం ఆరోపణ

2 లో

పెట్టుబడుల వేటలో చంద్రబాబు..

ఏపీకి భారీ పరిశ్రమలు!

- విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌పై సమీక్ష
- కొత్త పెట్టుబడి ప్రతిపాదనల పరిశీలన
- పరిశ్రమలకు వేగంగా అనుమతులు
- సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల అమలులో సమస్యల పరిష్కారం
- విద్యుత్, నీరు, రహదారుల కల్పనపై ఫోకస్
- ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలుకావాలి
- యువతకు ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యం

2 లో

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక సమీక్ష నిర్వహించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొంతమంది మంత్రులు ప్రత్యక్షంగా, మరికొంతమంది వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 'వైజాగ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'పై ప్రధానంగా చర్చించారు. ఈ భేటీకి మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, టీజీ భరత్, వాసంశెట్టి సుభాష్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

నగరవాసులకు

సర్కార్ దీపావళి గిఫ్ట్

- మెట్రో-ఆర్టీసీ పాస్‌లపై భారీ తగ్గింపు
- రూ.8,500 పాస్.. ఇక రూ.4 వేలే!
- ప్రయాణికులకు నెలకు రూ.4,500 ఆదా
- రోజువారీ పాస్‌పై రూ.125 తగ్గింపు
- నవంబర్ 8 నుంచి కొత్త ధరలు
- ఉద్యోగులు, విద్యార్థులకు భారీ ఊరట
- ప్రజా రవాణాకు సర్కార్ ప్రోత్సాహం

2 లో

ఎన్నికల పోలింగ్‌పై ఈసీ ప్రకటన!

- అక్రమ భవనాలపై చర్యలకు డిమాండ్
- పందలాది అక్రమ నిర్మాణాలంటూ ఆరోపణ
- హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన
- మీడియాకు బెదిరింపులపై ఆగ్రహం
- సమగ్ర సర్వేకు కవిత డిమాండ్
- కేంద్రం సాయం చేయలేదని ఆరోపణ
- సాగునీరు, విద్యుత్ సమస్యలపై నిలదీత



న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): కొన్ని ప్రాంతాలు హింసాత్మక ఘటనలు మినహాయిస్తే ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 5న అంటే గురువారం రోజు నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికలకు సంబంధించిన తుది పోలింగ్ శాతాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సగటున 70.72 శాతం పోలింగ్ నమోదైనట్లు ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లా అత్యధిక పోలింగ్‌తో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ 82.51 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు జిల్లాల మధ్య పోలింగ్ శాతంలో గణనీయమైన వ్యత్యాసం కనిపించింది.

2 లో

ఇది అతివృష్టి కాదు..

రేవంత్ వృష్టి!

- నదుల్లో నీళ్లున్నా పొలాలకు అందడం లేదు
- దేవాదులలో 18 టీఎంసీలకే పరిమితం
- కల్వకుర్తి మోటార్లు నడపడంలో వైఫల్యం
- చంద్రబాబు నీటిని ఒడిసిపట్టుకున్నారు
- పంటల బీమా అమలులో కాంగ్రెస్ విఫలం
- 25 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు
- అసెంబ్లీలో ఆధారాలతో ఎండగడతాం

2 లో

పాల ముసుగులో విషం..

హైదరాబాద్‌కు కల్తీ సరఫరా!

- పోచారంలో కల్తీ పాల కేంద్రం
- ఇంట్లోనే అక్రమ పాల తయారీ
- ఎస్ఓటీ పోలీసుల మెరుపు దాడి
- 100 లీటర్ల కల్తీ పాలు స్వాధీనం
- హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో కల్తీ
- 35 పాలపొడి ప్యాకెట్లు పట్టివేత

2 లో

సోనియా ఓటు.. మళ్లీ రచ్చ!



2 లో

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో ఆమె పేరు చేర్చారనే వివాదంలో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అదనపు ఆధారాలు, పత్రాలను సమర్పించేందుకు ఫిర్యాదుదారుడికి కోర్టు అనుమతినిచ్చింది.

కుటుంబానికి బీమా

ఇంటింటికీ భరోసా!



- ఈ నెల 19న ఇందిరమ్మ బీమా ప్రారంభం!
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భరోసా
- సిద్దిపేట వేదికగా పథకానికి శ్రీకారం
- 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఇంటింటికీ వెళ్లనున్న ఇందిరమ్మ కమిటీలు
- రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ
- కొడంగల్‌లో మెగా రైతు మేళా
- కరవుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు
- కాళేశ్వరం, ఎల్‌నినోపై సభలో చర్చలు

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో మరో కొత్త పథకం ప్రారంభించడానికి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 19న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీ తర్వాత పథకంపై కీలక ప్రకటన చేశారు. ఈ నెల 19న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి ఆ రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలవుతుందన్నారు.

మిగతాది 2 లో..

ఢిల్లీలో గాలి కాదు.. విషం!

- ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన
- రోజూ 30 సిగరెట్లు తాగినంత ప్రమాదం
- వాహనాల కాలుష్యంపై సీజేఐ ఆగ్రహం
- ప్రజా రవాణా మెరుగుపర్చాలని సూచన
- పంట వ్యర్థాల దహనంపై కీలక సూచనలు
- దీపావళి కాలుష్యంతో పేదలకు ఇబ్బందులు
- ఢిల్లీలో 400కు చేరిన ఏక్యూఐ



2 లో

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): దేశ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరడంతో సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఢిల్లీలో రోజూ గాలి పీల్చడం 30 సిగరెట్లు తాగడంతో సమానమని అమికస్ క్యూరీ అపరాజితా సింగ్ కోర్టుకు తెలిపారు. కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు.

ఢిల్లీ రహదారులపై వాహనాలు బంపర్ టు బంపర్‌గా నడుస్తున్నాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు.

మావోయిస్టుల ఆయుధ డంప్ గుట్టురట్టు!



- అడవిలో 711 గ్రెనేడ్ షెల్స్ స్వాధీనం
- బీజాపూర్‌లో భద్రతా బలగాల భారీ ఆపరేషన్
- సంయుక్త సెర్చ్‌లో బయటపడ్డ డంప్
- కర్రెగుట్టల వైపు వెళ్లొద్దని హెచ్చరిక
- ఐఈడీలు ఉండొచ్చని పోలీసుల అనుమానం
- త్వరలో డీమైనింగ్ ఆపరేషన్
- మావోయిస్టుల కంచుకోటలో కలకలం

2 లో

బెంగళూరులో

కుటుంబ సరమేధం

- భార్య కుటుంబంపై కక్ష పెంచుకున్న భర్త
- వారం రోజుల్లో ఏడుగురి హత్య
- రోకలిబండతో దాడి చేసి హతమార్చిన నిందితుడు
- మృతదేహాలను వేర్వేరు ప్రాంతాల్లో పడేసినట్లు అనుమానం
- రక్తపు మరకలు తుడిచేందుకు రసాయనాల వినియోగం
- పోలీసుల విచారణలో నేరం అంగీకారం
- ఒక మృతదేహం స్వాధీనం.. ఆరు కోసం గాలింపు



2 లో

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): బెంగళూరులోని రాజాజీనగర్‌లో అత్యంత ఘాతుకమైన, దారుణమైన ఉదంతం వెలుగు చూసింది. కుటుంబ కలహాల నేపథ్యంతో కక్ష పెంచుకున్న ఓ క్యాబ్ డ్రైవర్, ఏకంగా తన భార్య కుటుంబానికి చెందిన ఏడుగురిని వారం రోజుల వ్యవధిలో నరికి చంపిన ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు రాజాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భాష్యం సర్కిల్ సమీపంలోని 59వ క్రాస్‌లో ఉన్న నివాస ప్రాంతంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. నిందితుడిని 53 ఏళ్ల క్యాబ్ డ్రైవర్ ఇందుశేఖర్‌గా పోలీసులు గుర్తించారు. ఇందుశేఖర్‌కు సుమారు 20 ఏళ్ల క్రితం సునీత అనే మహిళతో వివాహమైంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 07-11-2026

సోనియా ఓటు.. మళ్లీ రచ్చ!

మొదటి పేజీ తరువాయి

అనంతరం తదుపరి విచారణను నవంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది.

పిటిషనర్ ఆరోపణ..

వికాస్ త్రిపాఠి అనే ఫిర్యాదుదారుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ, 1983లో సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందారని, అయితే అంతకంటే ముందే (1980 ఓటరు జాబితాలో) న్యూఢిల్లీ నియోజకవర్గం పరిధిలో ఆమె పేరు నమోదు అయిందని పేర్కొన్నారు. తప్పుడు పత్రాల ఆధారంగానే ఈ పేరు చేర్చారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.

సోనియా గాంధీ వాదన..

ఈ ఆరోపణలను సోనియా గాంధీ తీవ్రంగా ఖండించారు. పిటిషన్ రాజకీయ ప్రేరేపితమైనదని, చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని ఆమె తరపు న్యాయవాదులు వాదించారు. ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగానే ఈ ఫిర్యాదు చేశారని తెలిపారు. గతంలో మెజిస్ట్రేట్ కోర్టు ఈ ఫిర్యాదును తిరస్కరించగా, పిటిషనర్ రౌస్ అవెన్యూ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. మెజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో చట్టపరమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ సెషన్స్ కోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేసి, కేసును తిరిగి తాజాగా విచారించాలని మేజిస్ట్రేట్ కోర్టుకు పంపింది. ప్రస్తుతం కోర్టు ఫిర్యాదుదారునికి తన వాదనను బలోపేతం చేసేందుకు అదనపు పత్రాలను సమర్పించే అవకాశాన్ని ఇవ్వడంతో, నవంబర్ 18న జరగబోయే తదుపరి విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది.

కాంగ్రెస్‌లో వర్గపోరు.. అధిష్టానం వద్దకు పంచాయితీ!



న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వర్గపోరు మరోసారి వెలుగుచూసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుల మధ్య రేగిన వివాదం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్.. ఇద్దరి వ్యవహార శైలిపై కాంగ్రెస్ అధిష్టానానికి సమగ్ర నివేదికను పంపేందుకు సిద్ధమవుతున్నారు.

గాంధీ భవన్‌కు పిలిచినా డుమ్మా.. పీసీసీ చీఫ్ ఆగ్రహం

అయితే, ఇద్దరు నేతల మధ్య జరిగిన ఢిల్లీ పంచాయతీ వివాదం పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా మారడంతో, వివరణ ఇచ్చేందుకు గాంధీ భవన్‌కు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఇద్దరినీ ఆదేశించారు. నిన్న ఉదయం మంత్రితో, మధ్యాహ్నం ఎమ్మెల్యేతో విడివిడిగా మాట్లాడేందుకు పీసీసీ చీఫ్ గాంధీ భవన్‌కు చేరుకున్నారు. అయితే, ముందుగా సమావేశానికి వస్తానని చెప్పిన మంత్రి దామోదర రాజనర్సింహ చివరి నిమిషంలో రావడం లేదని సమాచారం ఇచ్చి డుమ్మా కొట్టారు. మంత్రి రాకపోవడంతో అసహనానికి గురైన మహేశ్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు భేటీని కూడా రద్దు చేసుకుని గాంధీ భవన్ నుంచి వెనుదిరిగారు. క్రమశిక్షణతో ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, పార్టీ పిలుపును సైతం ఖాతరు చేయకపోవడంపై పీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ఢిల్లీలో జరిగిన పంచాయితీ, అనంతరం గాంధీ భవన్‌లో విచారణకు హాజరుకాకపోవడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పూర్తి నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఇద్దరి ప్రవర్తనపై సమగ్ర సమాచారంతో కూడిన నివేదికను ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానానికి పంపించనున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి.

నిప్పురాజేసిన సంగారెడ్డి డీసీసీ వివాదం..?

కాగా, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్వస్థలం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్. ఈ క్రమంలో ఇటీవల సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంలో లక్ష్మీకాంతారావు తన వర్గానికి చెందిన నేతకు మద్దతు తెలిపారని, పక్క జిల్లా ఎమ్మెల్యే అయి ఉండి తన జిల్లా రాజకీయాల్లో జోక్యం చేసుకున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లుగా తెలిసింది. ఇటీవల ఢిల్లీలో రామ్‌లీలా మైదాన్ వేదికగా కాంగ్రెస్ చేపట్టిన 'చలో ఢిల్లీ' ర్యాలీ సందర్భంగా అక్కడి ఓ ప్రముఖ హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పలకరించగా.. ఆ సమయంలో మంత్రి తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే వర్గం ఆరోపించింది. ఈ రచ్చతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి వార్త పత్రికలు, సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే.

మావోయిస్టుల ఆయుధ డంప్ గుట్టురట్టు!

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): నక్సల్స్ ఏరివేత చర్యల్లో భాగంగా బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మరో భారీ విజయం సాధించాయి. ఉమ్మడి సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా అడవిలో మావోయిస్టులు దాచి ఉంచిన 711 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ షెల్స్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీ సంఖ్యలో పేలుడు పదార్థాలు లభించడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. నవంబర్ 5న అర్ధరాత్రి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బీజీపూర్ జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ 196వ బెటాలియన్, 204 కోబ్రా బెటాలియన్ సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఈ మేరకు ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడపాలా గ్రామంలోని భద్రతా బలగాల ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ సమీప అడవుల్లో ఈ ఆపరేషన్ చేపట్టారు. తాడపాలా క్యాంపునకు నార్త్ వెస్ట్ దిశలో సుమారు 1.5 కి.మీ దూరంలో ఉన్న కేజీ హిల్స్ అడవిలో దాచి ఉంచిన 711 బీజీఎల్ షెల్స్‌ను బలగాలు గుర్తించాయి. అన్ని పేలుడు పదార్థాలను నిర్దీత భద్రతా ప్రమాణాలు, మార్గదర్శకాలను పాటిస్తూ భద్రతా బలగాలు సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు.

కర్రెగుట్ట కొండల వైపు వెళ్లవద్దని హెచ్చరిక.. : అయితే, ఈ భారీ పేలుడు పదార్థాల గుర్తింపు నేపథ్యంలో పోలీసులు స్థానిక గ్రామీణ ప్రజలు, సాధారణ ప్రజలను కర్రెగుట్ట, చుట్టుపక్కల కొండ ప్రాంతాలకు ప్రస్తుతానికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతంలో ఇంకా భారీగా మందుపాతరలు, ఇతర పేలుడు పదార్థాలు దాచి ఉంచే అవకాశం ఉందని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. డంప్ లభ్యమైన ప్రాంతాన్ని సురక్షితంగా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా త్వరలోనే డీ మైనింగ్ ఆపరేషన్‌ను చేపట్టనున్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్ట కొండలు గతంలో మావోయిస్టు సంస్థల అగ్రనేతలకు సురక్షిత ప్రాంతాలుగా ఉండేవి. గత ఏడాది ఏప్రిల్-మే నెలల్లో ఇదే ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో భద్రతా బలగాలు 21 రోజుల పాటు విస్తృత ఆపరేషన్ నిర్వహించగా, కనీసం 31 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా ఒకేసారి 711 బీజీఎల్ షెల్స్ లభించడం అనేది ఆ ప్రాంతంలో మావోయిస్టుల పేలుడు పదార్థాల గుట్టును రట్టు చేయడంలో ఓ భారీ విజయంగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

పాల ముసుగులో విషం.. హైదరాబాద్‌కు కల్తీ సరఫరా!



న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): రంగారెడ్డి జిల్లాలో కల్తీ పాల తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ కేంద్రంలో తయారైన కల్తీ పాలను హైదరాబాద్‌లోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ పాలు, హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్పూర్ పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పోచారం గ్రామానికి చెందిన అండే శ్రీశైలం (43) పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్పూర్ పాలపొడిని కలిపి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అండే శ్రీశైలం ఇంట్లో దాడులు చేయగా.. అసలు విషయం బయటపడింది. దాడుల సందర్భంగా పోలీసులు 100 లీటర్ల కల్తీ పాలు, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్, ఒక్కో కిలో బరువున్న 35 ధోల్పూర్ పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి శ్రీశైలాన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కల్తీ పాలను హైదరాబాద్‌లో విక్రయించేందుకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. శ్రీశైలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

బెంగళూరులో కుటుంబ నరమేధం

మొదటి పేజీ తరువాయి

అయితే, భార్య తరచూ పుట్టింటికి వెళ్తుండటంపై వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్రమైన విభేదాలు కొనసాగాయి. గొడవల సమయంలో భార్య సునీతకు ఆమె తల్లి, సోదరులు మద్దతుగా నిలవడంతో వారిపై శేఖర్ తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఎలాగైనా భార్య కుటుంబ మొత్తాన్ని మట్టుబెట్టాలని ప్లాన్ వేశాడు.

వారం రోజుల వ్యవధిలో ఏడు మర్డర్లు..

ఇందు శేఖర్ తన ప్లాన్‌లో భాగంగా మొదటగా తన భార్య సునీతను రోకలిబండ తో బాది హత్య చేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని గుడ్డలో చుట్టి చిక్కబళ్లాపూర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన నంది హిల్స్ సమీపంలో పడేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి, భార్య ట్రిప్‌కు వెళ్లిందని పొరుగువారికి నమ్మబలికాడు. మరుసటి రోజు తన బావమరుదులైన శివకుమార్, శంకర్‌లను పార్టీ పేరుతో ఇంటికి పిలిపించి అదే రోకలిబండతో దాడి చేసి హత్య చేశాడు. ఆ తర్వాత బావమరుదుల భార్యలు దివ్య, నళిని, అత్త రూపవతి, అలాగే శివకుమార్ కుమారుడు పూనిత్ (7)ను కూడా దారుణంగా అంతమొందించాడు. ఇల మొత్తంగా భార్య సునీత, అత్త రూపవతి, బావమరుదులు శివకుమార్, శంకర్, వారి భార్యలు దివ్య, నళిని, ఏడేళ్ల మేనల్లుడు పూనిత్ సహా ఏడుగురిని హత్య చేసినట్లుగా తెలుస్తోంది.

సాక్ష్యాల మాయం.. నిజం వెలుగులోకి

అందరిని హత్య చేశాక ఇంటి గోడలు, నేలపై పడిన రక్తపు మరకలను వదిలించడానికి శేఖర్ రసాయనాలను (chemicals) ఉపయోగించి శుభ్రం చేశాడు. కాగా, నళిని ఆచూకీ కానరాకపోవడంతో ఆమె తల్లి శ్రీరాంపుర పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు మిస్సింగ్ వివరాలను పరిశీలించి, సంభాషణలు, ప్రవర్తన ఆధారంగా ఇందుశేఖర్‌ను 2 రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా ఆ ఏడు హత్యలకు తానే చేసినట్లుగా నిందితుడు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు. ఆ హత్యలకు ఉపయోగించిన రోకలిబండతో పాటు మృతదేహాలను తరలించడానికి వాడిన కారును స్వాధీనం చేసుకున్నారు. శేఖర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నంది హిల్స్ పరిసర ప్రాంతాల్లో మృతదేహాల కోసం గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకోగా, మిగిలిన ఆరు మృతదేహాల కోసం ముమ్మరంగా వెతుకుతున్నారు. ఈ దారుణంలో నిందితుడితో పాటు కుటుంబానికి చెందిన మరొకరి ప్రమేయం ఉందేమో అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగరవాసులకు సర్కార్ దీపావళి గిఫ్ట్

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, ప్రజా రవాణాను మరింత ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

భారీగా తగ్గిన పాస్ ధరలు ఇలా..

ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి పాస్ ధరను ఏకంగా రూ.4 వేలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రూ.4 వేలలో రూ.3 వేలు మెట్రో ప్రయాణానికి, రూ.వెయ్యి ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చు. దీందతో ప్రయాణికులకు నెలకు రూ.4,500 ఆదా కానుంది. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ.275కు తగ్గించారు. ఇందులో రూ.200 మెట్రోకు, రూ.75 ఆర్టీసీకి చెందుతాయి. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉంటుంది. దీని ద్వారా ప్రయాణికులకు ప్రతిరోజు రూ.125 ఆదా అవుతుంది.

నవంబర్ 8 నుంచి అమలు..

ఈ సవరించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అందుబాటులోకి వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక లబ్ధికి పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయం హైదరాబాద్ నగరంలో రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది.

ఎన్నికల పోలింగ్‌పై ఈసీ ప్రకటన!

మొదటి పేజీ తరువాయి

జిల్లాల వారీగా పోలింగ్ వివరాలను పరిశీలిస్తే.. శ్రీకాకుళంలో 65.51 శాతం, పార్వతీపురం మన్యంలో 67.13 శాతం, విజయనగరంలో 76.21 శాతం, విశాఖపట్నంలో 82.51 శాతం, అనకాపల్లిలో 75.58 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 62.01 శాతం, పోలవరంలో 65.48 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా కాకినాడలో 68.94 శాతం, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమలో 66.33 శాతం, తూర్పు గోదావరిలో 71.56 శాతం, పశ్చిమ గోదావరిలో 69.73 శాతం, ఏలూరులో 75.52 శాతం, కృష్ణా జిల్లాలో 73.21 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 75.53 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక, గుంటూరులో 73.12 శాతం, పల్నాడులో 70.93 శాతం, బాపట్లలో 67.47 శాతం, ప్రకాశంలో 68.53 శాతం, మార్కాపురంలో 67.69 శాతం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 70.62 శాతం పోలింగ్ నమోదైంది. తిరుపతిలో 68.67 శాతం, చిత్తూరులో 76.30 శాతం, అన్నమయ్య జిల్లాలో 69.19 శాతం, వైఎస్సార్ కడప జిల్లాలో 71.78 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరోవైపు.. రాయలసీమలోని ఇతర జిల్లాల విషయానికొస్తే.. అనంతపురంలో 64.38 శాతం, శ్రీ సత్యసాయి జిల్లాలో 73.71 శాతం, కర్నూలులో 68.29 శాతం, నంద్యాలలో 74.27 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా చూస్తే.. విశాఖపట్నం, విజయనగరం, చిత్తూరు, అనకాపల్లి, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో 75 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అల్లూరి సీతారామరాజు, అనంతపురం, పోలవరం జిల్లాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలను కలిపి సగటున 70.72 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఢిల్లీలో గాలి కాదు.. విషం!

మొదటి పేజీ తరువాయి



ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చూడాలని గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదని కోర్టు దృష్టికి వచ్చింది. డీజిల్ రిక్షాలను దశలవారీగా తొలగిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది.

పంట వ్యర్థాల దహనంపై సూచనలు

ఢిల్లీలో నవంబర్ 5న నమోదైన కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. రైతులకు పంట వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. వాటిని కొనుగోలు చేసే ధర ముందుగానే ప్రకటించాలని, ఖరీదైన యంత్రాలను వ్యక్తిగత రైతులకు కాకుండా గ్రామ పంచాయతీలకు అందించాలని అభిప్రాయపడింది. ఈ ఏడాది పంట వ్యర్థాల దహనం ఘటనలు తగ్గాయని కేంద్రం తెలిపింది.

పేదలపై కాలుష్య ప్రభావం

దీపావళి సమయంలో కాలుష్యం పెరగడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అమికస్ క్యూరీ తెలిపారు. దీనిపై స్పందించిన సీజేఐ.. పండుగలు పేదలకు ఉపాధి కల్పించే ముఖ్యమైన సమయమని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలు అన్ని వర్గాలపై సమానంగా ప్రభావం చూపేలా ఉండాలని సూచించారు.

మూలాలను పరిష్కరించాలి

ఢిల్లీలో ఏక్యూఐ 400 స్థాయికి చేరడం ఆందోళన కలిగిస్తోందని సీజేఐ వ్యాఖ్యానించారు. కాలుష్యాన్ని తాత్కాలికంగా నియంత్రించడం కాకుండా, వాహనాల కాలుష్యం, పంట వ్యర్థాల దహనం, ప్రజా రవాణా లోపాలు వంటి అసలు కారణాలను పరిష్కరించాలని కేంద్రానికి సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని స్పష్టం చేశారు.

పెట్టుబడుల వేటలో చంద్రబాబు.. ఏపీకి భారీ పరిశ్రమలు!

మొదటి పేజీ తరువాయి

విశాఖ పెట్టుబడుల సదస్సును విజయవంతం చేయడంతో పాటు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకురావడంపై సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడి ప్రతిపాదనలను సమావేశంలో సమీక్షించారు చంద్రబాబు.. కొత్త పరిశ్రమలకు అనుమతులు, భూకేటాయింపులు, ప్రభుత్వపరమైన అనుమతుల ప్రక్రియపై చర్చించారు. ఇప్పటికే ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిని కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. పెట్టుబడుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఇక, భవిష్యత్తులో భారీ ఉపాధి అవకాశాలను కల్పించే సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వసతుల కల్పనపై చర్చించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

మరోవైపు, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. పోర్టులు, రవాణా వ్యవస్థలు, సరకు రవాణా కేంద్రాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించడం ద్వారా పారిశ్రామిక రంగానికి మరింత ఊతమివ్వాలని చర్చించారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పెట్టుబడులకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు దారితీయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనలో అనవసర జాప్యాన్ని నివారించాలని, నిర్దీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు వేగంగా సేవలు అందించడంతో పాటు ఇప్పటికే ఆమోదం పొందిన ప్రాజెక్టులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మొత్తంగా ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పరిశ్రమల ఏర్పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనకు ఈ సదస్సును కీలక వేదికగా మార్చాలని యోచిస్తున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

ఇది అతివృష్టి కాదు.. రేవంత్ వృష్టి!

న్యూస్ డెస్క్, 06 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అనాలోచిత కరువు అని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఇది అతివృష్టి, అనావృష్టి కాదని.. కేవలం 'రేవంత్ వృష్టి' మాత్రమేనని అభివర్ణించారు. నదుల్లో కావాల్సినంత నీటి లభ్యత ఉన్నప్పటికీ, పంపులు నడిపి నీళ్లను ఎత్తిపోసే చేతగానితనాన్ని ఈ ప్రభుత్వం ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆధారాలతో సహా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలతో సరిపెట్టిందని హరీష్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ నీటిని ఒడిసి పట్టుకున్నారని పేర్కొన్నారు. శ్రీశైలంలో సరిపడా నీళ్లు ఉన్నప్పటికీ కల్వకుర్తి ఎత్తిపోతల వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు చంద్రబాబు నాయుడు ఏకంగా 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని గుర్తుచేశారు.

గ్లోబల్ వార్మింగ్, 'ఎల్ నినో' ప్రభావం వస్తుందని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో పంటల బీమా గురించి గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేయడం మరచిపోయారని.. ఇవాళ పంటల బీమా ఉండి ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో తక్షణ కరువు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని ఉదహరించారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే, కనీసం క్యాబినెట్ భేటీలో కూడా దీనిపై చర్చించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నేడు తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు దాపురించాయని స్పష్టం చేశారు.

కుటుంబానికి బీమా.. ఇంటింటికీ భరోసా!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభమవుతుందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి సంబంధించి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరిస్తాయన్నారు. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారని తెలిపారు. అంతేకాదు ఈ నెల 19న సిద్ధిపేట వేదికపై నుంచి ఇందిరమ్మ చీరలు రెండో విడత పంపిణీని ప్రారంభిస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా దీపావళి రోజున మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటిస్తారు.. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభతో పాటుగా కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎక్స్‌పో నిర్వహిస్తారు. దీపావళి పండగరోజున నిర్వహించే సీఎం నుంచి సర్పంచ్ వరకు వారి పరిధిలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా ఒక ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నారు.

మరోవైపు రాష్ట్రంలో కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలో ప్రత్యేకంగ అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఎల్‌న

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 07-11-2026

1000 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి

జీవో నం.31లోని నిబంధనలను సవరించాలి.. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలి
నిరుద్యోగ జేఏసీ, విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్



హైదరాబాద్ నవంబర్ 06(ఇది కద నిజం)

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసేందుకు కనీసం 1000 పోస్టులతో ఒకేసారి నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నం.31లోని నిబంధనలను సవరించి, స్థానిక అభ్యర్థులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ..యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు చేపట్టి దాదాపు 13 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో ఖాళీల భర్తీ జరగకపోవడం ఆందోళనకరమన్నారు.ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ సైతం కేవలం ఏడు యూనివర్సిటీలకే పరిమితం కావడంతో పాటు, విభాగాల వారీగా ఖాళీల వివరాల్లో స్పష్టత లేదని విమర్శించారు.కొన్ని విభాగాలకు తక్కువ పోస్టులు కేటాయించగా, మరికొన్ని విభాగాలకు అసలు పోస్టులే కేటాయించకపోవడం నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయడమేనన్నారు.పబ్లికేషన్లకు సంబంధించిన నిబంధనలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి, ప్రతిభ కలిగినప్పటికీ కొన్ని అర్హతల నిబంధనల కారణంగా అనేకమంది అభ్యర్థులు అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. జీవో నం.31లోని పార్ట్-బి, వెయిటేజీ విధానంలో ఉన్న అంశాలను పునఃపరిశీలించి, అభ్యర్థులకు న్యాయం జరిగేలా మార్పులు చేయాలని సూచించారు.యూనివర్సిటీల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న కనీసం 1000 టీచింగ్ పోస్టులను ఒకేసారి భర్తీ చేసి ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకులను మినహాయించినా రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 1000కు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాటన్నింటికీ తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ఫేజ్-1, ఫేజ్-2 పేరుతో నియామక ప్రక్రియను విడతలుగా చేపట్టి కాలయాపన చేయకుండా, ఒకేసారి 1000 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్ల నిధులు కేటాయిస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలని, యూనివర్సిటీ అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని మూర్తి డిమాండ్ చేశారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు కిరణ్, హర్షవర్ధన్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ శీను, పుష్పలీల, రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత డా. శంకర్, రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్, ఎన్ఎస్యుఐ ఓయూ నేత శ్రీధర్, బీసీ విద్యార్థి నాయకులు డా. అవ్వారు వేణుకుమార్, చేరాల వంశీ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చిరంజీవి, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యప్రకాష్, పరిశోధక విద్యార్థులు మల్లేష్, విజయ్, రమేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఫిర్యాదులపై మెమోలతో సరిపెట్టవద్దు

పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి

వరంగల్ నవంబర్ 06 (ఇది కద నిజం)

పోలీస్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, మానవ హక్కుల కమిషన్, జాతీయ బీసీ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాలకు ఫిర్యాదులు చేసినప్పటికీ మెమోలు, బదిలీ ఉత్తరాలు మాత్రమే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఫిర్యాదులపై విచారణ జరిగిందా? ఏ చర్యలు తీసుకున్నారు? అనే వివరాలతో కూడిన నివేదికలు అందడం లేదన్నారు.

విద్యార్థి బొనగిరి శరత్ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విద్యార్థి బొనగిరి శరత్‌కు సంబంధించిన కేసు అతని విద్యాభ్యాసం, భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరారు.అందుబాటులో ఉన్న ఆధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, విచారణ పూర్తికాకముందే ఎవరినీ దోషిగా నిర్ధారించరాదని సూచించారు.తమ పోరాటం వ్యక్తిగత కక్షతో కాదని, ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలపై వాస్తవాలు వెలికితీసి, తప్పులు లేదా చట్ట ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మెమోలు కాదు..వాస్తవ విచారణ కావాలి, బదిలీ ఉత్తరాలు కాదు..చర్యలపై స్పష్టమైన నివేదిక కావాలి.రాష్ట్రపతి ఈ అంశాన్ని పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి విచారణ నివేదికలు, తుది నిర్ణయాల వివరాలు తెప్పించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కాట కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.

రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మోకు కనకరెడ్డి పిలుపు



స్టేషన్ ఘన్‌పూర్ నవంబర్ 06 (ఇది కద నిజం)

అఖిలభారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మోకు కనకరెడ్డి రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న ఈ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ సందర్భంగా శుక్రవారం ఇప్పగూడెం గ్రామానికి చెందిన రైతు వారాల ఈశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మోకు కనకరెడ్డి పంటలను పరిశీలించారు.అనంతరం జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నప్పటికీ అందుకు తగిన ధరలు లభించడం లేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, పంటల కొనుగోలుకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని కోరారు.అలాగే రైతుల రుణభారాన్ని తగ్గించి సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత రైతు సంఘం నిరంతరం పోరాటాలు సాగిస్తోందని, భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేసే వేదికగా 36వ జాతీయ మహాసభలు నిలవనున్నాయని తెలిపారు. నవంబర్ 15న నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న రైతు గర్జన బహిరంగ సభకు రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో హాజరై జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, మండల కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, బోడ నరేందర్, సుంచు విజేందర్, ఇప్పగూడెం ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, జనగామ పట్టణ మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి, రైతు సంఘం మండల కార్యదర్శి లింగనబోయిన కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మంద మొగిలి, నాయకులు గట్ల మల్లారెడ్డి, కుర్ర ఉప్పలయ్య, పోలాసు పరమేష్, తోడంగల మల్లయ్య, జి. గురుస్వామి, రైతు వారాల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

భర్త అనారోగ్యం.. ఇద్దరు పిల్లల పోషణ భారంతో మనస్తాపం

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 6 (ఇది కద నిజం)

జనగామ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది.కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, భర్త అనారోగ్యం, ఇద్దరు పిల్లల పోషణ భారంతో మానసికంగా కుంగిపోయిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం..మీదికొండ గ్రామానికి చెందిన తాళ్లపల్లి సునీత (37) కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భర్త పక్షవాతంతో బాధపడుతుండగా, ఇద్దరు పిల్లల పోషణ, ఇంటి ఖర్చులు భరించడం ఆమెకు భారంగా మారాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన సునీత నవంబర్ 5న సాయంత్రం 7 గంటల నుంచి 7.30 గంటల మధ్య ఇంటి వెనుక ఉన్న వేపచెట్టుకు చీరతో ఉరివేసుకుంది.గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను చెట్టు నుంచి కిందకు దించి చూడగా అప్పటికీ ప్రాణాలతో ఉండటంతో వెంటనే 108 అంబులెన్స్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతురాలి సోదరుడు పగిడిపల్లి నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

జఫర్‌గఢ్‌లో ఘనంగా ఫాస్ట్ మ్యాథ్స్ క్విజ్ పోటీలు

జిల్లా స్థాయి పోటీలకు మూడు పాఠశాలల జట్లు ఎంపిక



జఫర్‌గఢ్ నవంబర్ 06 (ఇది కద నిజం)

జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి ఫాస్ట్ మ్యాథ్స్ క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని పది ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల జట్లు పాల్గొన్నాయి.గత వారం రోజులుగా మండలంలోని వివిధ పాఠశాలల్లో పాఠశాల స్థాయి పోటీలు నిర్వహించి, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థుల్లో ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులతో జట్లు ఏర్పాటు చేసి మండల స్థాయి పోటీలకు పంపించారు.జిల్లా పరిశీలకులుగా డిప్యూటీ తహశీల్దార్ మందరపు రామారావు, డీఆర్పీ మాడిశెట్టి శ్రీనివాస్ వ్యవహరించారు.మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు క్విజ్ మాస్టర్లుగా కూనూరు ప్రధానోపాధ్యాయులు మహ్మద్ పర్వేజ్, జఫర్‌గఢ్ ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి పద్మ బాధ్యతలు నిర్వహించారు.స్కోరర్లుగా పిట్టల మహేందర్, తౌటం వెంకటేశ్వర్లు, కే. సీతారామయ్య, గిరిబాబు వ్యవహరించారు.మొదట పది పాఠశాలల నుంచి వచ్చిన 50 మంది విద్యార్థులకు 30 బహుళైచ్ఛిక ప్రశ్నలతో వ్యక్తిగత రాత పరీక్ష నిర్వహించారు.అనంతరం పాఠశాలల వారీగా జట్ల మధ్య పోటీలు నిర్వహించి, రెండు రౌండ్లలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ఆరు జట్లను ఫైనల్‌కు ఎంపిక చేశారు. తుది దశలో గణితంలోని వివిధ అంశాలపై ఐదు రౌండ్లలో ఉత్కంఠభరితంగా క్విజ్ పోటీలు జరిగాయి.తుది ఫలితాల్లో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జఫర్‌గఢ్ మొదటి స్థానం, కేజీబీవీ జఫర్‌గఢ్ రెండో స్థానం, జెడ్పీహెచ్ఎస్ ఉప్పుగల్ మూడో స్థానం సాధించాయి. ఈ మూడు పాఠశాలల జట్లు జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యాయి.ఈ సందర్భంగా జిల్లా పరిశీలకులు మందరపు రామారావు, మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ విజేత విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ మొత్తం కార్యక్రమాన్ని వీడియో చిత్రీకరించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు భూక్యా వంశీకృష్ణ, కరుణాకర్, శ్రీధర్, నరేందర్, హరిప్రసాద్, ఎంఐఎస్ కో మామిడాల శివ, కంప్యూటర్ ఆపరేటర్ బక్కం రాజ్‌కుమార్, సీఆర్‌పీ పుట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

మూడో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి.. కార్మికులకు కౌన్సిలర్ బూడిద జ్యోతి సూచన



జనగామ, నవంబర్ 6 (ఇది కద నిజం)

పట్టణంలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జనగామ మున్సిపాలిటీ మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బాలాజీనగర్‌లో మూడో వార్డుకు కేటాయించిన తొమ్మిది మంది పారిశుద్ధ్య కార్మికులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.వార్డు జవాన్ మాదారపు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బూడిద జ్యోతి మాట్లాడుతూ.. జనగామ పట్టణంలోని మూడో వార్డు శివారు ప్రాంతంలో ఉన్నప్పటికీ, మధ్యతరగతి కుటుంబాలు, ఉద్యోగులు, వ్యాపారులు, పిల్లల చదువుల కోసం పట్టణంలో స్థిరపడిన రైతు కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నారని తెలిపారు. వార్డులోని ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మూడో వార్డును పారిశుద్ధ్య నిర్వహణలో జనగామ పట్టణానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కార్మికులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.విధులకు సకాలంలో హాజరుకావడంతో పాటు సమయపాలన పాటించాలని, కేటాయించిన ప్రాంతాల్లో చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు గుంటుక దామోదర్ రెడ్డి, సీపీఎం శాఖ కార్యదర్శి గుండు శశిరేఖ, రిటైర్డ్ ఉపాధ్యాయులు మాసంపల్లి నరసయ్య, పారిశుద్ధ్య కార్మికులు తాటి యాకుబ్, ఎలకంటి యాకూబ్, చౌడ కవిత, పానుగంటి మల్లయ్య, మిద్దెపాక సుధాకర్, సోనబోయిన ఆంజనేయులు, కన్నారపు సురేందర్, గోల్కొండ చింటూ తదితరులు పాల్గొన్నారు.

మెమోలు, బదిలీ ఉత్తర్వులతో సరిపెట్టొద్దు..

పోలీస్ ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలి: కాట కుమారస్వామి



వరంగల్ (ఇది కద నిజం) నవంబర్ 6:

పోలీస్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి డిమాండ్ చేశారు.ఈ మేరకు భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, మానవ హక్కుల కమిషన్, జాతీయ బీసీ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాలకు ఫిర్యాదులు చేసినప్పటికీ, విచారణ నివేదికలు, తీసుకున్న చర్యల వివరాలు అందకుండా కేవలం మెమోలు,బదిలీ ఉత్తర్వులకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదులపై విచారణ జరిగిందా? ఏ ఆధారాలను పరిశీలించారు? ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టంగా తెలియజేయాలని కోరారు.విద్యార్థి బొనగిరి శరత్‌కు సంబంధించిన కేసులో అతని విద్యాభ్యాసం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్ర విచారణ జరపాలని అన్నారు. అందుబాటులో ఉన్న ఆధారాలు, సంబంధిత పత్రాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించి, విచారణ పూర్తయ్యే వరకు ఎవరినీ దోషిగా నిర్ధారించకుండా చట్టబద్ధమైన ప్రక్రియను పాటించాలని కోరారు.తమ పోరాటం వ్యక్తిగత కక్షతో కాదని, ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలపై వాస్తవాలు వెలికితీసి, విధి నిర్వహణలో తప్పులు లేదా చట్ట ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.మెమోలు కాకుండా పూర్తిస్థాయి విచారణ, బదిలీ ఉత్తర్వులు కాకుండా చర్యలపై స్పష్టమైన నివేదిక అందించాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసినట్లు కాట కుమారస్వామి తెలిపారు. న్యాయం జరిగే వరకు రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో తమ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

హిమ్మత్‌నగర్‌లో ఉచిత పశువైద్య చికిత్స శిబిరం

- **66 పశువులకు వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**
- **లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించుకుని ఆడ దూడలను పొందవచ్చు: పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్**



జఫర్‌గఢ్ నవంబర్ 06 (ఇది కద నిజం)

జఫర్‌గఢ్ మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కడుదూరి మమత సోమయ్య, ఉపసర్పంచ్ ఇంతల రాజు, ఉప్పుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కాకుమాను శ్రీనాథ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందని, దీని ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే ఆడ దూడలు పొందే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు.అనంతరం డాక్టర్ కాకుమాను శ్రీనాథ్ శిబిరానికి తీసుకొచ్చిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.పశువుల ఆరోగ్య పరిరక్షణకు సకాలంలో వైద్య సేవలు పొందాలని, గోపాలమిత్రుల సేవలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.ఈ శిబిరంలో మొత్తం 66 పశువులకు వైద్య సేవలు అందించారు. ఇందులో 22 పశువులకు ఎద సమస్యలపై పరీక్షలు, 24 దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ, 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ, 11 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎంపటి రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రులు సాంబరాజు దివ్య, మల్లెపాక సంపత్, మైదం రజిత, సుదగోని గోపాల్, కే. లచ్చయ్య, సీహెచ్. నాగేష్, జి. రాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 07-11-2026



సినిమా న్యూస్



తొలి భారతీయ నటుడిగా ఘనత!



తమిళ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనత సాధించనున్నారు. నవంబర్ 23న న్యూయార్క్‌లో జరగనున్న 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలో అవార్డును అందించే తొలి భారతీయ నటుడిగా విజయ్ సేతుపతి చరిత్ర సృష్టించబోతున్నారు. అంతర్జాతీయ వేదికపై భారతీయ సినీ ప్రతిభకు మరో గుర్తింపు లభించనుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్ స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్న తొలి భారతీయ నటుడిగా విజయ్ సేతుపతి నిలవనున్నారు. ఈ ఘనత వెనుక ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ బోర్డు సభ్యురాలు, నిర్మాత కవితా గుప్తా పాత్ర కూడా ఉంది. అంతర్జాతీయ వేదికలపై భారతీయ ప్రతిభకు మరిన్ని అవకాశాలు కల్పించడంలో ఆమె కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2024లో జరిగిన ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్స్ వేడుకకు హాస్యనటుడు వీర్ దాస్‌ను హోస్ట్‌గా తీసుకురావడంలోనూ కవితా గుప్తా పాత్ర ఉంది. 2023లో తన కామెడీ స్పెషల్ 'వీర్ దాస్: ల్యాండింగ్'కు ఆయన ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డు అందుకున్నారు. అప్పుడు వీర్ దాస్ హోస్ట్‌గా వ్యవహరించగా.. ఇప్పుడు విజయ్ సేతుపతి ప్రజెంటర్‌గా కనిపించనున్నారు.

విజయ్ సేతుపతి ఇటీవల వచ్చిన 'బత్తా' చిత్రంలో నటించారు. 1986 నాటి మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ కథలో బత్తా అనే భయంకరమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో విజయ్ నటించారు. ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న రొమాంటిక్ డ్రామా 'ఇంజి వెల్లం'లో విజయ్ నటించనున్నారు. ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు విజయ్ నటించిన థ్రిల్లర్ 'మహారాజా' హాలీవుడ్‌లో రీమేక్ కానుంది. చైనాలో ఈ సినిమా మంచి విజయాన్ని అందుకున్న తర్వాత హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ రీమేక్ హక్కుల కోసం నిర్మాతలను సంప్రదించినట్లు నిర్మాత సుధన్ సుందరం వెల్లడించారు.

నటనకు బ్రేక్ దర్శకత్వంపై గురి!



మలయాళ స్టార్ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ తన కెరీర్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు మాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. సాధారణంగా ఏడాదికి నాలుగైదు సినిమాలతో ప్రేక్షకులను అలరించే ఆయన.. 2026లో మాత్రం సోలో హీరోగా పెద్దగా సినిమాలు చేయలేదు. క్యామియో పాత్రలు, మల్టీస్టారర్ చిత్రాలకే పరిమితమయ్యారు. దీనికి కారణం 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్‌తో తెరకెక్కించబోయే ప్రాజెక్ట్ అని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

ఈ ఏడాది బాసిల్ జోసెఫ్ 'పరాశక్తి', 'మాలీవుడ్ టైమ్స్' చిత్రాల్లో ప్రత్యేక పాత్రల్లో కనిపించారు. అలాగే మల్టీస్టారర్ మూవీ 'అతిరధి'లో హీరోల్లో ఒకరిగా నటించారు. ఈ సినిమా విజయంతో నటుడిగానే కాకుండా.. నిర్మాతగా లాభాలు వచ్చాయి. అయితే సోలో హీరోగా మాత్రం బాసిల్ నుంచి సినిమా విడుదల కాలేదు. హీరోగా నటించిన చివరి చిత్రం 'మరణమాస్'. ఆ తర్వాత ఏడాదిన్నర కాలంగా మరో సోలో ప్రాజెక్ట్‌లో కనిపించలేదు. ప్రస్తుతం ఆయన చేతిలో గతంలోనే అంగీకరించిన తమిళ చిత్రం 'రావడి', 'మంజేశ్వరం మాఫియా' ఉన్నాయి. రావడిలోనూ పూర్తి స్థాయి హీరో పాత్ర కాదని, క్యామియో తరహా పాత్ర అని ప్రచారం జరుగుతోంది.

అవకాశాలు లేక కాదు.. స్వయంగా నటనకు కొంత విరామం ఇచ్చి దర్శకత్వంపై దృష్టి పెట్టాలని బాసిల్ జోసెఫ్ నిర్ణయించుకున్నాడట. దీనికి ప్రధాన కారణం అల్లు అర్జున్‌తో చేయనున్న సినిమా అని టాక్. 'గోదా', 'మిన్నల్ మురళి' వంటి చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బాసిల్.. ఇటీవల బన్నీకి ఓ కథ వినిపించి ఆయన నుంచి గ్రీన్ సిగ్నల్ పొందినట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ.. మాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బాసిల్ సందడి చేయడం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

ప్రస్తుతం అల్లు అర్జున్ సినిమా కోసం బాసిల్ పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. కథ, స్క్రీన్‌ప్లేను పక్కాగా రూపొందించడంపైనే ఆయన దృష్టి పెట్టారని.. అందుకే నటనకు కొంతకాలం విరామం ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. బన్నీ, లోకేశ్ కనగరాజ్ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత బాసిల్ దర్శకత్వంలో సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అటు అల్లు అర్జున్.. ఇటు బాసిల్ జోసెఫ్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

'అఖండ 2' సీన్ రిపీట్?



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా' చుట్టూ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ హాట్ చర్చ నడుస్తోంది. గతంలో 'అఖండ 2' రిలీజ్ విషయంలో ఎలాంటి గందరగోళం, వాయిదాల పర్వం సాగిందో.. ఇప్పుడు 'దాదా' విషయంలోనూ దాదాపు అదే సీన్ రిపీట్ కానుందా అన్న అనుమానాలు సినీ వర్గాల్లో బలపడుతున్నాయి. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న థియేటర్లలోకి రావాల్సిన ఈ చిత్రం.. చెప్పిన డేట్‌కే వస్తుందా లేక రేస్ నుంచి తప్పుకుంటుందా అనే సందిగ్ధత నందమూరి అభిమానులను తీవ్ర టెన్షన్‌కు గురిచేస్తోంది.

'వీరసింహారెడ్డి' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత గోపీచంద్ మలినేని -- బాలయ్య కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటినుంచీ భారీ అంచనాలున్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌ను దసరా బరిలోనే దించాలని భావించినా, షూటింగ్ ఆలస్యం కావడంతో డిసెంబర్ 24కి మార్చారు. తీరా కాకినాడ పోర్టులో కీలకమైన యాక్షన్ ఎపిసోడ్ తీస్తుండగా బాలకృష్ణకు కాలుజారి గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ పడింది. దాదాపు రెండు నెలల పాటు ఆయన విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో అసలు క్రిస్మస్‌కు రావడం అసాధ్యమనే ప్రచారం ఊపందుకుంది. అయితే డేట్ మిస్ కాకూడదన్న పట్టుదలతో బాలయ్య గాయం నుంచి కోలుకున్న వెంటనే నాన్‌స్టాప్‌గా రంగంలోకి దిగారు. మైసూర్ షెడ్యూల్ ముగించుకుని, రామోజీ ఫిల్మ్ సిటీలో నాలుగు రోజుల పాటు భారీ యాక్షన్ సీన్స్ పూర్తి చేశారు. కానీ కాకినాడలో మిగిలిపోయిన ఫైట్ సీక్వెన్స్‌ను రీ-షూట్ చేద్దామనుకునే సమయానికి తీరం దాటిన తుఫాను, ఎడతెరిపిలేని భారీ వర్షాలు యూనిట్ ప్లాన్‌ను పూర్తిగా దెబ్బతీశాయి.

ప్రస్తుతం రిలీజ్‌కు కేవలం 50 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఇంకా బాలయ్య, కాజల్ అగర్వాల్ కాంబినేషన్‌లో ఒక పాటతో పాటు పలు కీలక సన్నివేశాల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉన్నట్లు సమాచారం. దీనికి తోడు తమన్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రానికి పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనులకు కూడా తగినంత సమయం అవసరం. ఇంత తక్కువ టైంలో వాటన్నింటినీ పూర్తి చేసి డిసెంబర్ 24న థియేటర్లలోకి తీసుకురావడం మేకర్స్‌కు కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలోనే సినిమా వాయిదా పడుతోందంటూ సోషల్ మీడియాలో జోరుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. మరి ఈ రూమర్లపై చిత్ర యూనిట్ క్లారిటీ ఇస్తుందా.. లేక గత అనుభవాల దృష్ట్యా సైలెంట్‌గా ఉండి రిలీజ్ డేట్‌ను మార్చుతారా అన్నది చూడాల్సి ఉంది.

ఈ ఏడాది లేనట్టేనా

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తూ, తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రాపో23' విడుదల వాయిదా పడినట్లు తెలుస్తోంది. మొదట ఈ సినిమాను 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే షూటింగ్ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ సినిమా 2027కు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా ఇండస్ట్రీ సమాచారం ప్రకారం, ఇప్పటివరకు సినిమా షూటింగ్ సుమారు 40 శాతం మాత్రమే పూర్తయినట్లు టాక్.

రామ్ ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన షెడ్యూల్స్ కూడా ఈ సినిమా చిత్రీకరణపై ప్రభావం చూపినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో అనుకున్న సమయానికి రాపో23ను విడుదల చేయడం కష్టంగా మారిందని టాక్. కాగా.. ఇందులో రామ్ 'వీర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో సంయుక్త, రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మిస్తున్నారు. రామ్ హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

